

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**రైలు దిగమంటాడని** కళ్ళో కూడా ఊహించలేదు రాజేష్. తెల్లబోతూ చూసాడు.

"దిగరా రాస్కెల్"

"నా పెట్టె, సంచి"

ముసలాయన జాలిగా చూశాడు రాజేష్ వంక. తన దగ్గర డబ్బుకూడా లేదు. ఫైన్ కట్టి టిక్కెట్ కొందామంటే. తమ రైలు ఛార్జీలకే ఉద్యోగం చేసే కొడుకు అప్పు చేయాల్సి వచ్చింది.

ఆయన లేచి పెట్టె, కొక్కేనికి వేలాడుతున్న సంచి, అట్టపెట్టె రాజేకే అందించాడు.

"దయతలచి నిన్ను పోలీసులకి అప్పగించటంలేదు. ఇంకెప్పుడైనా రైల్లో నా కంటపడ్డావో జాగ్రత్త" అరిచాడు టి.సి.

రాజేష్ ముందు రైలు దిగి, తరువాత ముసలాయన అందించిన తన సామానుని అందుకున్నాడు. రాజేష్ దాచుకునే దుఃఖాన్ని చూస్తూంటే ఆయన గుండె కరిగిపోయింది. ఈ లోకంలో కరిగే గుండెలోని మానవత్వం ఏం చేయలేదు ఒక్క డబ్బు తప్ప.

"జాగ్రత్త నాయనా!"

"సికింద్రాబాద్ స్టేషన్‌కి మా ఆంటీ వస్తుంది నా కోసం. ఇలా అయిందని అమ్మకి ఉత్తరం రాయమనండి. ఈలోగా అమ్మ దగ్గరకి వెళతాను" అన్నాడు రాజేష్.

"ఎలా వెళతావు? "

"రైలు పట్టాలమీద నడిచి" ఈ మాత్రం తెలియదా అన్నట్లు చూస్తూ అన్నాడు రాజేష్.

"దేముడు నిన్ను చల్లగా చూడాలి" ముసలాయన కంఠం వణికింది. వెనక్కి తిరిగి తలవంచుకుని నడుస్తున్న రాజేష్‌ని కాసేపు చూసి దీర్ఘంగా నిట్టూర్చి వచ్చి కూర్చున్నాడు ఆయన రైలు కదలగానే.

అందరి టిక్కెట్స్ తనిఖీ చేస్తూ చెపుతున్నాడు టి.సి.

"నన్నడిగితే ఇలాంటి వాళ్ళని షూట్ చేసి పారేయాలి. పెద్దవాళ్ళు కావాలని ఇచ్చే ట్రైనింగ్‌లో ఇదో భాగం. చేతికందిన సామాను పట్టుకుని ఎక్కడో దిగిపోతారు. నా సర్వీస్‌లో ఇలాంటి వాళ్ళని ఎంతమందిని చూశానో. పెద్దయ్యాక రౌడీలుగా తయారయ్యేది వీళ్ళే."

తన చేతిలో టిక్కెట్‌ని చూసి దానిమీద సంతకం చెయ్యలేదు. మరోసారి చూశాడు. తర్వాత ఆ టిక్కెట్ ఇచ్చిన పేపర్ చదివే పొడుగాటి వ్యక్తిని ఎగాదిగా చూశాడు.

అతను టి.సి తనని చూస్తూండటం గమనించి ఏమిటన్నట్టుగా చూశాడు.

"మీ వయసెంత?"

"ముప్పై ఆరు. ఏం?"

"మరి ఈ టిక్కెట్ ఏమిటి?"

"దానికేం?"

"ఇది హాఫ్ టిక్కెట్."

"హాఫ్ టిక్కెట్టా?" నాలిక కొరుక్కుని అతను మరో జేబులోంచి ఇంకో టిక్కెట్ తీసి టి.సి. కందించి హాఫ్ టిక్కెట్‌ను తీసుకోబోయాడు.

ప్రయాణీకుల్లోని ఓ యువకుడు దాన్ని టి.సి చేతిలోంచి అందుకున్నాడు.

"మీ కెక్కడిది యిది?" అడిగాడు ఆ పొడుగాటి వ్యక్తిని.

తడబడ్డాడు. సమాధానం చెప్పలేదు అతను.

"టి.సి.గారూ ఇది ఆ కుర్రాడిది. ఈ పెద్దమనిషి కాజేసినట్లున్నాడు" చెప్పాడు ఆ యువకుడు.

"ఏం?" అడిగాడు టి.సి. అతన్ని గుచ్చి గుచ్చి చూస్తూ.

"అది నాది" అతని మాటల్లో స్థిరత్వం లేదు.

"మీ వెంట పన్నెండేళ్ళలోపు వాళ్ళెవరయినా వున్నారా?" అడిగాడు టి.సి.

"లేరు" బలహీనంగా చెప్పాడు.

"మరి దేనికి కొన్నట్లు?"

జవాబు లేదు.

"నిస్సందేహంగా ఇది అంతకుముందు మీరు దింపేసిన కుర్రాడిదే ఇది చాలా అన్యాయం" చెప్పాడు ఆ యువకుడు ఆవేశంగా.

"మిస్టర్ నిజం ఒప్పుకోండి. లేదా తరువాత స్టేషన్‌లో మిమ్మల్ని పోలీసులకి అప్పగిస్తాం." ముసలాయన బెదిరించాడు.

"నే కొనలేదు. ఆ కుర్రాడిదే" చెప్పాడతను వెంటనే తలొంచుకుని.

ఆ యువకుడు లేచి నిలబడి టి.సి మొహంలో మొహం పెట్టి చూస్తూ అడిగాడు.

"ఇప్పుడు మీరేం చేయదలచుకున్నారు? ఈ అన్యాయాన్ని ఎలా సరిచేయదలచుకున్నారు?"

టి.సి కూడా తెల్లమొహం వేశాడు.

"ఇందాక మీది రైటు కాబట్టి నేను మాట్లాడలేదు. ఆ కుర్రాడి దగ్గర టిక్కెట్ లేకపోవటం తప్పుకాబట్టి మౌనంగా వుండిపోయాను. ఇక ఊరుకోను. రైలాపండి. ఆ కుర్రాడిని మళ్ళీ ఎక్కించుకోండి. లేదా మీ పై ఆఫీసర్‌కి జరిగింది ఫిర్యాదు చేసి వాణ్ణి పోలీసులకి అప్పగించి, ఇది పార్లమెంటుదాకా వెళ్ళేలాగా చేయగలను. నేనెవరో తెలుసా?" అతని వాగ్ధాటికి జంకాడు టి.సి.

వెంటనే చెయిన్ లాగాడు. రైలు కొద్ది నిమిషాల్లో ఆగింది. టి.సి దిగి గార్డ్ పెట్టెవైపు నడిచాడు. అంతా ఆ పొడుగటి వ్యక్తివంక అసహ్యంగా చూడసాగారు. అతను వాళ్ళ చూపులు భరించలేక పేపర్‌ని అడ్డుపెట్టుకున్నాడు. రుమాల మడతల్లోంచి కాజేసిన ఆ టిక్కెట్‌ని కిటికీలోంచి బయట పారేయకుండా తన జేబులో వేసుకోవడంతో ఇలా అయింది. ఎంత పొరపాటు చేశాడు తను లేకపోతే తను క్యూలో వుండగా తన ముందు వచ్చి నిలబడి టిక్కెట్ కొనుక్కుంటాడా?

సాటి మనిషి మీద తోటి మనిషికి అకారణ ద్వేషానికి నిలయమైన ఈ కాలంలో, అలాంటి మనస్తత్వం గలవారు అక్కడక్కడ చాలామంది ఉన్నారు.

రైలు మళ్ళీ బయలుదేరింది. ఈసారి వెనక్కి, ఇందాక రాజేష్‌ని దింపేసిన ప్లాట్‌ఫాం ముందు ఆగింది.

లేడు.

ప్లాట్‌ఫాం పూర్తిగా ఖాళీగా ఉంది.

ఆ ముసలాయన దిగి గార్డు దగ్గరకి వెళ్ళి చెప్పాడు. ఇందాక రాజేష్ చెప్పిన మాటలు. కాసేపు తర్జన భర్జనలు పడ్డాక రైలు మళ్ళీ బయలుదేరింది. ఈసారి కూడా వెనక్కి.

దాదాపు నాలుగు ఫర్లాంగులు వెళ్ళాక కొద్దిదూరంలో నేలమీద ఓ చెట్టునీడలో కూర్చుని వున్న రాజేష్ కనబడ్డాడు. గొంతుక కూర్చుని బూటు లేసులు బిగించుకుంటున్నాడు.

రాజేష్ 'శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ' అనే పదాలు ఆగకుండా ఉచ్చరిస్తున్నాడు.

వెనక్కి వచ్చే రైలుని ఓసారి చూసి లేచి మళ్ళీ సామానుతో విజయవాడ వైపు అడుగులు వేయసాగాడు. కంపార్టుమెంటు కిటికీలోంచి తనవంక చూస్తూ రమ్మనమని చాలామంది చేతుల్తో పిలవడం చూసి వింతగా ఆగాడు.

రైలు ఆగాక గార్డు, ముసలాయన, టి.సి, మరికొందరు రైలు దిగి తనవైపు రావటం చూశాడు. అర్థంకాక అలాగే నిలబడిపోయాడు.

టి.సి వచ్చి చెప్పాడు.

"రా బాబూ"

రాజేష్ అర్థంకానట్లు చూడటంతో చెప్పాడు ముసలాయన.

"వెళ్దాం పద."

రాజేష్‌ని ఎత్తుకున్నాడు గార్డు. అతని సామాను టి.సి. అందుకున్నాడు. అంతా రాజేష్ వంక చూస్తున్నారు.

"ఎంత చిన్నపిల్లవాడో, టి.సి.కి బుద్ధిలేదు దింపడానికి. పాపం ఒంటరిగా ఏమైపోయేవాడో?" లాంటి కామెంట్స్ చేస్తున్నారు మిగతా ప్రయాణీకులు.

"అంకుల్ నేను రైలింజన్‌లో కూర్చోవచ్చా?" అడిగాడు గార్డుని.

ఆయనకి సరిగ్గా రాజేష్ ఈడు మనవడున్నాడు. ఆ పిల్లవాడి కోరిక సరిగ్గా అదే. రాజేష్ బుగ్గమీద ముద్దు పెట్టుకుని చెప్పాడు.

"ఇంకోసారి"

రాజేష్ తన సీట్లో కూర్చున్నాక రైలు బయల్దేరింది.

"ఇందాక నువ్వు చెప్పింది ఎంతో నిజం రాజేష్. సింహం గుహలాంటి ఈ లోకంలోకి వచ్చిన సింహాలే తప్ప, మేకలు బ్రతకలేవు" చెప్పాడు ముసలాయన వాత్సల్యంగా రాజేష్ తల నిమురుతూ.

"నీ టిక్కెట్ దొంగతనం చేసిన పెద్దమనిషి వాడే" ఆ యువకుడు చెప్పాడు రాజేష్‌తో.

"పోనీండి అంకుల్. శ్రీరాముడ్ని ప్రార్థించాను. మంచే జరిగిందిగా?"

అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ అక్కడి వాతావరణం మాములు అయింది. రాజేష్ మీద ప్రత్యేక శ్రద్ధ ఏర్పడటంతో అతని వివరాలు అడుగుతున్నారు చాలామంది.

"వరంగల్లు ఎప్పుడొస్తుంది?" అడిగడు రాజేష్ రైలు ఖమ్మంలో ఆగితే.

"ఇది వరంగల్లు స్టేషనా?" అడిగాడు రైలు డోర్నకల్లు జంక్షన్‌లో ఆగితే.

మెహబూబాబాద్‌లో ఆగాక, స్టేషన్ పేరు చదివి అడిగాడు మళ్ళీ "వరంగల్ ఇంకా ఎంత దూరం?"

కాసేపటికి వరంగల్ స్టేషన్‌లో ఆగింది రైలు.

"ఇదే బాబు వరంగల్లు. ఎవరయినా వస్తారా నిన్ను చూడటానికి?" అడిగింది ముసలావిడ.

"ఎవరూ రారు. ఈ స్టేషన్ వచ్చాక తినమని చెప్పింది అమ్మ."

రాజేష్ ముందు టింకూకి అరటిపళ్ళు, జామకాయ ముక్కలు పెట్టాడు. అది తృప్తిగా తిన్నాక దాన్ని చేతిమీదకి ఎక్కించుకున్నాడు. ఆ ముచ్చటయిన ఉడుత ఎంతో అలవాటుగా చేతిమీదనించి రాజేష్ భుజం మీదకి పాకి అక్కడ కూర్చుంది.

రాజేష్ చేతిసంచి అందుకుని, అందులోంచి మైనపు సంచి తీసి, దానికి కట్టిన దారం విప్పి, మినపరొట్టెల మూటని తీశాడు. ఆరు భాగాలుగా కోయబడి ఉందది. రెండు తను తీసుకున్నాడు. మిగతా నాలుగులో ఒకటి ముసలాయనకిచ్చి, ఒకటి యువకుడికి, ఒకటి కిటికీలోంచి చేతులు చాచిన బిచ్చగత్తెకి యిచ్చాడు.

ముసలాయన, యువకుడు ముందు నిరాకరించినా రాజేష్ బలవంతం మీద తీసుకోక తప్పలేదు.

చివర భాగాన్ని చదివిన పేపర్నే మళ్ళీ మళ్ళీ చదువుతున్న ఆ పొడుగాటి వ్యక్తికి యిచ్చాడు.

"ఒద్దు."

"ఫర్వాలేదు అంకుల్. తీసుకోండి."

"వద్దన్నానా?"

"నామీద మీకింకా కోపం పోలేదా అంకుల్? ప్లీజ్ తీసుకోండి" ప్రాధేయపూర్వకంగా అడిగాడు రాజేష్. ఆ పొడుగాటి వ్యక్తి లేచి, పైన వున్న తన బ్రీఫ్‌కేస్ తెరచి, అందులోంచి చందమామ తీసి రాజేష్‌కి అందించి, మినపరొట్టె తినసాగడు.

రాజేష్ తనకు తెలియకుండానే తన శత్రువుని పూర్తిగా ఓడించాడు. ఆ పొడుగాటి వ్యక్తి కూడా తనకు తెలియకుండానే ఓడిపోయాడు.

సీసాలోని నీళ్ళు వేడిపడటంతో, అతను దిగి చల్లటి నీళ్ళు పట్టి తెచ్చాడు. రైలు ఆగే ఆ మూడు నిమిషాల్లోనే.

కాజీపేటలో దిగిపోయాడు. ఆ పొడుగటి వ్యక్తి, రాజేష్ చందమామని ఆసక్తిగా చదువుకుంటుంటే.

వాళ్ళమధ్య వీడ్కోలు చోటుచేసుకోలేదు. 5

"నా జీవితంలో ఇది ఎంతో అందమైన రోజు" చెప్పాడు సాంబశివరావు తన భార్య నీరజకి.

"ఏం?"

"మన హనీమూన్ ఆఖరి రోజు కనక. ఇక వచ్చే జన్మలోనేగా మళ్ళీ హనీమూన్."

"ఈసారి ఎవరితో?"

"నీతోనే ఏడు జన్మలదాక మొగుడూ పెళ్ళాలు కలిసివుంటారుట."

"ఆ అమ్మాయితో అవచ్చుగా? "

"ఏ అమ్మాయితో?"

"మీరు ప్రేమలోపడ్డ అమ్మాయితో. ఇది మన ఏడో జన్మ అవచ్చుగా?"

కాసేపు సాంబశివరావుకి అర్థంకాలేదు నీరజ ఏం చెప్తోందో, అర్థం అయ్యాక చెప్పాడు.

"ది టంగ్ ఆఫ్ ఎ బేడ్ వైఫ్ కట్స్ మోర్ దేన్ ఏ నైఫ్."

"అయ్యో పాపం."

"నిజం. ఇప్పుడు నా మనసులో నువ్వు తప్ప ఎవరూ లేరు."

"నేను సైకాలజీ స్టూడెంట్‌ని. ఎదుటివారి మనసులో ఏం వుందో గమనించగలగడం గురించిన పాఠాలు రోజూ వింటూంటాను."

సాంబశివరావు కాసేపు మౌనంగా వుండిపోయాడు. తర్వాత అడిగాడు నవ్వుతూ.

"అయితే ఇందాకటి కాసేపు నా మనసులో ఏం వుందో చెప్పుకోండి చూద్దాం?"

"ఆమె."

"కాదు. మంచం, గొడుగు, మబ్బులు."

ప్రశ్నార్థకంగా చూసింది నీరజ.

"ఆకాశం నిండా మబ్బులు పట్టివుండగా అకస్మాత్తుగా ఇంటికి తిరిగొచ్చిన భర్త కంటపడింది భార్య. మంచం మీద మరొకడి కౌగిలిలో ఉంది ఆమె. ఆవేశంతో భర్త ఆ కొత్త వ్యక్తి తనతో తెచ్చుకున్న గొడుగును అందుకున్నాడు. రౌద్రంగా దాన్ని రెండు చేతులతో పట్టుకుని ఎత్తాడు. తన బలమంతా ఉపయోగించి దాన్ని కిందికి దించుతూ, మోకాలిమీద దాన్ని అడ్డంగా పగలకొట్టాడు భర్త. కొద్దిసేపట్లో వర్షం రావాలని నా కోరిక" చెప్పాడు.

ఆ జోక్‌కి నవ్వుతుందని ఎదురు చూసిన సాంబశివరావుకి ఆశాభంగం కలిగింది.

నీరజకి ఆ జోక్ అర్థంకాలేదో, లేదా కావాలని నవ్వలేదో సాంబశివరావుకి అంతుపట్టలేదు.

"ఒక జోక్‌కి చాలామంది మూడుసార్లు నవ్వుతారు. చెప్పగానే ఓసారి, వివరించగానే మరోసారి, అర్థం అయ్యాక ఆఖరిసారి. ఈసారి యిది జాగ్రత్తగా విను. మెటర్నిటీ వార్డ్‌కి పోస్టు చేయబడ్డ కొత్త డాక్టర్ కానుపుకి సిద్ధంగా వున్న గర్భవతులని పలకరిస్తున్నాడు. "మీ కానుపు ఏ రోజు?" అడిగాడు ఒకామెని.

"ఫిబ్రవరి నాలుగు" చెప్పిందామె. తర్వాతి బెడ్‌లోని గర్భవతి కూడా ఆ ప్రశ్నకు అదే సమాధానం చెప్పింది. ఆ తర్వాత్ బెడ్‌లోని పేషెంట్ కూడా ఫిబ్రవరి నాలుగు అనే చెప్పింది. నాలుగో బెడ్‌లోని పేషెంట్ నిద్రపోతుండటం గమనించి, దగ్గరలో వున్న మరో పేషెంట్ వైపు తిరిగి అడిగాడు. ఆమెకి కానుపు ఎప్పుడు రావచ్చును. ఫిబ్రవరి నాలుగున మాత్రం కాదు, మీ వెంట ఈమె నాగార్జున సాగర్‌కి పిక్‌నిక్‌కి రాలేదు' అని జవాబు చెప్పింది."

ఈసారి నీరజ పెదాలు విడివడకుండా నవ్వింది.

"దట్స్ గుడ్ మనం పోట్లాడుకోవటానికి ముందు ముందు చాలా కాలం వుంది" చెప్పాడు సాంబశివరావు నీరజని దగ్గరకి తీసుకుని.

"ఆమె పేరు చెప్పనేలేదు?" అడిగింది నీరజ.

"చూడు నీరజా! ఈ టాపిక్ మాట్లాడుకోకూడదని మొదటిరోజే ఓ ఒప్పందానికి వచ్చినట్లు గుర్తు."

"నిజమే. సారీ పేరు తెలుసుకోవాలని. అంతే"

"గతానికి కాని, భవిష్యత్తుకి కాని, వర్తమానం అంత ప్రాముఖ్యత వుండనిదే హనీమూన్. లెట్స్ ఎంజాయ్ ది ప్రజెంట్ టెన్స్" చెప్పాడు సాంబశివరావు.

సాంబశివరావుకి ఒకందుకు సంతోషంగా ఉంది. తన భార్యలో మెంటల్ మెచూరిటీ, సంస్కారం, పరిస్థితులను అర్థం చేసుకోగలగటం ఉన్నాయి. అదే యింకో అమ్మాయి అయితే, తన పూర్వ ప్రేమకథ సంగతి తెలిసి ఎంత గొడవచేసి వుండేదో, జీవితం నరకం చేసేయగలరు కొందరు ఆడవాళ్ళు.

తన ఆలోచనలు నీరజకి చెప్పటానికి భయపడ్డాడు. పొగుడుతున్నాడని అనుకోవచ్చు.

ఆ రాత్రి యిద్దరూ ఓ ఎయిర్ కండిషన్డ్ రెస్టారెంటులో భోజనం చేశారు.

"డేమిట్ నాకు బెండకాయ యిష్టంలేదు."

"నాకు బంగాళాదుంపలు అసలిష్టంలేదు" చెప్పాడు సాంబశివరావు.

"మీకే కూరిష్టం?"

"కాకరకాయ వేపుడు, ఉల్లిపాయ ముక్కలు వేసి చేసిన కందిపచ్చడి ప్లస్ నువ్వు ఏది బాగా వండగలిగితే అది" నవ్వాడు.

"ఎంతైంది టైం?" అడిగింది నీరజ.

చీకట్లో సాంబశివరావు తన రేడియం డయల్ వాచ్ చూసి చెప్పాడు.

"రెండూ అయిదు"

మీకు నిద్రరావటంలేదా?"

"ఉహూఁ నీకు?"

"కొద్దిగా.. నిన్న పొద్దున్న నేను హోటల్‌కి యింకా ఆలస్యంగా వచ్చివుంటే, ఆ హోటల్ యజమాని నిజంగా మిమ్మల్ని పోలీసులకి అప్పగించి వుండేవాడా?" అడిగింది.

"నా చేతికి ఉంగరం, వాచీ ఉన్నాయిగా. అంతదూరం వచ్చి వుండకపోవచ్చేమో. లెట్ మి అన్‌రాప్ యువర్ సెక్యూరిటీ డివైజ్."

"వాట్?"

"సెక్యూరిటీ డివైజ్.. ఐ మీన్ బ్రా."

"షటప్"

మరో అరగంట తర్వాత అడిగాడు సాంబశివరావు.

"నీకు కొడుకంటే యిష్టమా? కూతురా?"

"మీకు?"

"కొడుకే. పెద్దయ్యాక చేతికి అందివస్తాడు."

"నాకు కూతురు. ఎంచక్కా జడవేసి, గోరింటాకు పెట్టి రబ్బరు బొమ్మలా అలంకరించొచ్చు. పెద్దయితే పనిలో సహాయం కూడా చేస్తుంది."

మాటల్లోనే యిద్దరూ నిద్రలోకి జారిపోయారు. నాలుగు ఇరవై అయిదుకి నీరజకి చటుక్కున మెలుకువ వచ్చింది ఏదో దబ్బుమని పడిన చప్పుడికి.

కళ్ళు విప్పి చూస్తే చీకటి, చెయ్యిచాపి లైట్ వెలిగించింది.

సాంబశివరావు మంచం పక్కన నేలమీద నుంచీ లేస్తున్నాడు.

"ఏమైంది?" అడిగింది నీరజ.

"పడ్డాను."

"మంచం మీంచే?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును."

వెంటనే నీరజకి శోభనం రాత్రి గదిలోకి వెళ్ళబోయేముందు మామగారు ఇచ్చిన సలహా గుర్తొచ్చింది.

మెలుకువ వచ్చింది కాబట్టి ఆ తర్వాత యిద్దరూ నిద్రపోలేదు. ఈసారి సాంబశివరావు గోడవైపే పడుకున్నాడు.

అదే రోజు బెంగుళూరు నుండి సికింద్రాబాద్ వెళ్ళే రైల్లో ఇద్దరూ యింటికి బయలుదేరారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఆగింది. అందరికన్నా చివరగా దిగాడు రాజేష్. భుజాన సంచితో, చేతిలో అట్టపెట్టె, సూట్‌కేస్‌లతో.

అయిదు నిముషాలదాకా మేరీ ఆంటీకోస్మ చూశాడు. కానీ ఆమె కనపడలేదు.

"మీ మేరీ ఆంటీ రాలేదా?" అడిగాడు ముసలాయన.

రాలేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

"నేను మీ ఇంటికొచ్చి దిగబెట్టేవాణ్ణి కానీ మినార్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబే వెళ్ళిపోతున్నాం" చెప్పాడాయన విచారంగా.

"ఫర్వాలేదులెండి. నేనొక్కణ్ణే వెళ్ళగలను" చెప్పాడు రాజేష్.

తనకి తెలిసిన వాళ్ళెవరయినా కనబడతారేమోనని చూశారాయన. వాళ్ళకి రాజేష్‌ని అప్పచెప్పవచ్చని. కనబడకపోవడంతో చెప్పాడు.

"పద బాబూ గేటుదాకా తోడువస్తాను"

రాజేష్ టిక్కెట్ యిచ్చి గేటు దాటాక చెప్పాడు ఆ ముసలాయన "జాగ్రత్త బాబూ"

రాజేష్ స్టేషన్లోంచి బయటకి వచ్చి ఎదురుగా విశాలంగా వున్న ప్రదేశాన్ని, ఆగి వున్న వాహనాలని చూశాడు. యూనిఫారంలో వున్న ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ దగ్గరకి వెళ్ళి, చొక్కా జేబులోంచి తాతయ్య ఇంటి చిరునామా రాసివునన్ కాగితం తీసి చూపించాడు.

"ఏ బస్‌లో వెళ్ళాలి? నేనీ ఊరికి కొత్త" అడిగాడు.

కానిస్టేబుల్ ఆ కాగితంలోని చిరునామా చదివి, దూరంగా వున్న బస్టాండ్ వంక చూపించి చెప్పాడు.

"అక్కడికి వెళ్ళి ఎనభై ఆరో నంబర్ బస్సు ఎక్కు. కండక్టర్ ఈ కాగితం చూపిస్తే టిక్కెట్ యిస్తాడు."

రాజేష్ ఖాళీగా వున్న ఓ ఎనభై ఆరో నంబర్ బస్సు ఎక్కి కూర్చున్నాడు. బస్సు నిండసాగింది క్రమంగా.

ఆ బస్‌లోకి ఎక్కిన యిద్దరు సీట్లవంక చూశారు. ఆ ఇద్దరూ పక్కపక్కనే కూర్చోడానికి సీట్లు ఖాళీల్లేవు. టూ సీటర్స్‌లో కిటికీవైపు కూర్చుని ఉన్నారు అంతా.

అన్ని రోజులు తన భార్యతో కలిసివున్న సాంబశివరావుకి, నీరజకి దూరంగా కూర్చోవడం యిష్టంలేదు. ఒంటరిగా కూర్చుని వున్నవారిని చూశాడు.

ఆరేళ్ళ పిల్లవాడు అతని కంటపడ్డాడు. ఆ కుర్రాడి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"బాబూ, కొంచెం ముందుసీట్లో కూర్చుంటావా?"

ఆ కుర్రాడు కెళ్ళెత్తి సాంబశివరావువంక, నీరజవంక చూసి "అలాగేనండి" అని లేచి తన సామానుతో ముందు సీటులోకి మారాడు.

"హి ఈజ్ సో క్యూట్ అండ్ ఒబ్లెయిజింగ్. ఈజిస్టు హి?" అడిగింది నీరజ రాజేష్‌ని మెచ్చుకుంటూ.

"ఎస్.. ఆటో స్ట్రయిక్ లేకపోతే ఎంత బాగుండేదో?"

రాజేష్ కండక్టర్‌కి రెండు రూపాయలనోటు, తతయ్య ఎడ్రస్ చీటీ అందించి చెప్పాడు.

"ఎక్కడ దిగాలో బస్‌స్టాప్ రాగానే చెప్తారా? నేనీ ఊరికి కొత్త."

కండక్టర్ టిక్కెట్, చిల్లర యిచ్చి ముందుకు వెళ్ళిపోయాడు. బస్ బయలుదేరింది. రాజేష్ కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

బయట వాతావరణం ఎంతో కొత్తగా వింతగా ఉంది. భయంగా వున్నా ఏదో కొత్తగా ఉంది రాజేష్‌కి.

మనసులో 'శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ' అనుకోసాగాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

[www.anandbooks.com](http://www.anandbooks.com)
[www.telugubooks.in](http://www.telugubooks.in)